ఆ క్షణంలో నే నేస్థితిలోవున్నానో ఊహించుకోగలవు. నా మెదడు పని చేయటం మానివేసింది. తలుపులు వేసుకుని పడుకున్నాను, అమ్మ హడా విడిగా వచ్చి ముఖం కడుక్కుని పట్టు చీరకట్టుకోమంది. తెలివుండేచేశానో, ఎల్లా వెళ్ళి అతనిముందు కూర్చున్నానో నాన్నగారు అడిగినప్పుడు ఆలోచనా రహితంగా "సరే" అని ఎలాఅన్నానో నాకు తెలియదు. కాని జరిగిందేమి టంటే, నేను ఆ ఇంజనీరుగారికి నచ్చానుకాబట్టి ప్రదానం, ముహూర్తం పెట్టుకోవడం అన్నీ జరిగిపోయాయి. మరో పదిహేనురోజులలో నేను శ్రీమతిని కాబోతున్నాను.

ఆత్మద్రోహం చేసుకున్నా నంటావా ? ఆదర్శాలని గొప్పలుచెప్పి ఆచరణలో పెట్టలేక పారిపోయిన పిరికి నంటావా ? నా ప్రేమకి అర్థం లేదంటావా ? లేక నాది పవిత్రమైన ప్రేమ కాదనీ, అయితే అంతస్థులు అడ్డువచ్చేవి కావంటావా ? నీ రాధ బాధపడుతుందని నువ్వనకపోయినా నా మనసే నన్ను సవాలు చేస్తోంది.

అతని కథలోలాగా ముగింపుచేద్దామనుకున్నాను. కానీ, ఈ ప్రాణాలు అంత త్వరగాపోవు.ఈ రంపపుకోతను యిలా అనుభవించవలసివుండగా అప్పుడే ఎలా మరణిస్తాను.

అత నెన్నోవిధాల తన పరిస్థితి, మా ప్రేమ సఫలమవటానికి వున్న అభ్యంతరాలని ఎత్తి చూపించాడు. కాని, నేను సరిగ్గా అర్థంచేసుకోకుండానే నా ఆదర్శాలని వల్లించాను. అతడిని పరోక్షంగా రెచ్చగొట్టాను. అతని ప్రేమలతకి నీరుపోసి స్వయంగా పెంచి, యీ నాడు గొడ్డలితో సమూలంగా నరికివేశాను. నా కెవరిచ్చారీ అధికారం ?

"ఒరేయి మధూ !" అన్న నాలుకతో "ఏమండీ" అనలేను. అమ్మానాన్నలతో అనిపించలేను. ఐనా ప్రేమించింది రాజేష్‌ని, మధుని కాదనుకుంటాను నేను. కాదు—అంతరంగంలో మధుమీద అనురాగంవుంది కానీ, అంతస్తులభేదం గుర్తుకువచ్చి భయపడ్డావని—ఎదురుతిరుగుతోంది మనసు.

పెళ్ళిపనులకి కాంతమ్మని పిలిపించింది అమ్మ. మధుకి నా పెళ్ళికి ఉండటానికి వీలు లేదని వచ్చిన ట్రాన్స్‌ఫరుని తిట్టింది కాంతమ్మ. సెలవు పెట్టి వుండిపొమ్మని బలవంతం చేసింది అమ్మ. నాన్నగారు ట్రాన్స్‌ఫరుని మార్పించి తిరిగి యిక్కడికే వేయిస్తానన్నారు. ఆ క్షణంలో నా వైపు చూసిన చూపులకి అర్థం చెప్పలేను. కళ్ళల్లోని బాధ నన్ను శపించలేదు, నాశనం చేయలేదు. కనీసం నా మీద నాకు కోపమైనా రాలేదు. జాలిగా నవ్వుకున్నాను. ఎండి బీటలు బారిన హృదయం అంటే ఏమిటో, కఠిన పాషాణం అంటే ఏమిటో ఇప్పుడు నాకుబాగా తెలుసు.

పెళ్ళికి రావాలనిపిస్తే రా. ఇంతకంటె ఎలా ఆహ్వానించను ? మరో విషయం. మధు వివాహం నిన్ననే అయింది. ఆత్మహత్య చేసుకోబోతున్న ఒక అనాథను రక్షించి దేవాలయంలో పెళ్ళాడాడట. నా ఆశయాలని, ఆదర్శాలని వెక్కిరించటానికేమో ! ఇక వుంటాను,

రాధిక.

□□□

# పరీక్ష

వడ గాడ్పులు చంద్ర నిప్పుల్ని తూర్పార పడుతున్నాయి. చెట్టూ చేమా నిశ్చలంగా వున్నాయి. నిప్పులు పరచినట్లున్న తారురోడ్లు శూన్యంగా వున్నాయి. ఆదివారం పూట, గాలి పొరాడని యింట్లో వేసవి పెట్టే బాధ ఇబ్బడి ముబ్బడిగా వుంది.

"నమస్కారమండీ !" ఎండ యింట్లోకి రాకుండా వేసిన తలుపును తోసుకుంటూ ఒకతను లోపలికొచ్చాడు.

"రండి-కూర్చోండి" అన్నాను.

కూర్చున్నాడు.

"మీరు ... ..." అతడు నా ప్రశ్నను వినటంలేదు. గోడకు వేలాడుతున్న నా పెళ్ళి ఫొటోను తదేకంగా చూస్తున్నాడు.

"మీరెవరో చెప్పారు కారు ! సభ్యంగా ధ్వనించే కంఠంతో ప్రశ్నించాను.

"ఒక బీద బ్రాహ్మణ్ణి" ఏదో ఆలోచనల్లోనుంచి మాట్లాడాడు.

ఎండకు మగ్గిపోయిన దేహచ్ఛాయ. ఈ బ్రతుకును నిరసించి ఎక్కడో చూస్తున్న కళ్ళు. రాలిపోయిన కనుబొమల క్రింద నిశ్చలమైన గాజు కళ్ళు. ఆలోచనతో తెరుచుకున్న నోట్లో అరిగి పోయిన పళ్ళు-కానీ ఏదో ఆకర్షణ ... ... ఆమాట తెలుస్తూనే వుంది. కానీ అడిగాను.

"ఏ పనిమీద వచ్చారు ?"

"ఈ నెల పదిహేనో తారీఖున నా కూతురికిపెళ్ళి. బీదబ్రాహ్మణ్ణి. మీరే

దైనా కాస్త సాయం చేయాలి. కన్యాదాన ఫలం చాలా దొడ్డది...' వినయంతో నవ్వుతూ లగ్న పత్రికను తాంబూలంలో పెట్టి అందిచ్చాడు.

అందుకొని టేబిలు మీద పెట్టాను.

మళ్ళీ అతడు గోడకువేలాడుతున్న నా పెళ్ళిఫోటోను చూస్తూకూర్చు న్నాడు. ఇప్పుడతని వాలకం చూస్తే యిందాకా మాట్లాడిన వ్యక్తి యితడేనా అనిపిస్తుంది.

"అమ్మాయిని ఏ వూళ్ళో యిస్తున్నారు ?" అడిగాను. నాప్రశ్న అతడికి వినిపించలేదు.

"మన సీతారాముల కల్యాణము... ..." లోగొంతులో పాడుకుంటున్నాడు. చూపులు మాత్రం నిశ్చలంగా పెళ్ళి ఫోటో మీదే వున్నాయి.

"కుమార్తె పెళ్ళి మనసులో తిరుగుతున్నది కాబోలు" అనుకున్నాను.

రాయల సీమలో వర్షంలా వచ్చిన గాలి తెరకు పెళ్ళి పత్రిక ఎగిరి క్రింద పడింది... అప్పుడు అతనికి డబ్బివ్వాలన్న విషయం జ్ఞాపకం వచ్చింది. కానీ ఎంతివ్వాలో ... రూపాయో అర్థో యిస్తే నొచ్చుకుంటాడేమో! ఎక్కువ యివ్వటానికి నావద్ద లేదు. ఇంట్లోకెళ్ళి మా ఆవిడను అడిగాను. తనవద్దకూడా లేదన్నది. ఇక మరోదారి లేదు. ఎండలో అప్పుకోసం బయలుదేరవలసిందే!

అతడు ఫొటోను చేతికందుకొని కిటికీవద్దకు వెళ్ళి కళ్లు చికిలించి చూస్తున్నాడు.

"అలా బజారుదాకా వెళ్ళొస్తాను. ఒక్క క్షణం కూర్చోండి" అన్నాను.

ఉలిక్కిపడి కనుబొమల ముడిలో నుంచి శూన్యంగా నా ముఖంలోకి చూశాడు.

"ఆలస్యం కాదులెండి" అంటూ బయటికి నడిచాను ... ...

అప్పు దొరికేసరికి ఆలస్యమే జరిగింది. అరగంట తర్వాత చెమటతో దొప్పదోగుతూ యిల్లు చేరాను.


అతడు లేడు!

చుట్టూరా వెదికితే కనిపించలేదు! మా ఆవిడను అడిగితే తనకు తెలియదన్నది!

వీధిలోకెళ్ళి చుట్టుపట్ల వెదికాను. అతడు కనిపించలేదు. ఉసూరుమంటూ ఇంటికొచ్చేసరికి నా పెళ్ళిఫొటో కనిపించలేదు. మిట్టమధ్యాహ్నం

వల్లంపాటి వెంకటసుబ్బయ్య





ఇంద్రధనుస్సు కనిపించినంత ఆశ్చర్య పోయాను. అతనికి నా పెళ్ళిఫొటో దొంగిలించి పారిపోవాల్సిన అవసరమేమి కలిగింది? అతడెవరు? ఇంతకుముందు నాకెప్పుడూ పరిచితుడు కాడే! మరి ఎవరు??

మేఘంలేని వర్షంలా యెందుకొచ్చాడు? అతనికి నా పెళ్ళి ఫొటోతోవున్న అవసరమేమిటి? తేనెతుట్టెచుట్టూ తిరుగుతున్న తుమ్మెదల్లా వేయిప్రశ్నలు నా మెదడులో ఝుంకారం చేస్తున్నాయి. ఆలోచ

నలు ముందుకు సాగక, కుర్చీలో కూలబడ్డాను.

టేబిలుమీదున్న లగ్నపత్రికనన్ను వెక్కిరించింది!

చదివిచూచి ఆశ్చర్యపోయాను. ఆ లగ్నపత్రిక గతసంవత్సరం జరిగిపోయిన పెళ్ళికిసంబంధించింది. వధువు గాయత్రి, వరుడు నాగలింగశాస్త్రి. అమ్మాయి తండ్రిపేరు పున్నయ్యశాస్త్రి. మనస్సు తేలికపడింది. శంకామేఘాలు చెదరిపోయి నిర్మలమయింది... ...

రెండురోజులతర్వాత దీప దీపాలవేళ సూర్యనారాయణగారు పిలుస్తున్నారని జవాను వచ్చాడు. వారు పిలిచారంటే మన పనులన్నీ మూటకట్టిమూలపెట్టి బయలుదేరవలసిందే!

"అక్కడ ఎవరెవరున్నారు?" జవాన్ని అడిగాను.

"రోజూ వచ్చేవారు యెవరూ లేరండి. ఎవరో కొత్తమనిషి వుండాడు."

వాణ్ణడిగి లాభంలేదనుకొని నేనే బయలుదేరాను. సూర్యనారాయణగారివద్ద కెళ్ళటమంటే ఆ వూళ్ళోని కవితాపక్షుల కందరికీ చాలా సరదా. వారితో కూర్చొని గంటలతరబడి కాలక్షేపం చేయవచ్చు— మధ్యలో వేరుసెనక్కాయలూ, ఉప్పుసెనగలూ తింటూ.

నేను వెళ్ళేసరికి సూర్యనారాయణగారూ, పున్నయ్యశాస్త్రీ మౌనంగా కూర్చొని వున్నారు.

"రండిరండి. మీకోసమే ఎదురుచూస్తున్నాము. వీరి పేరు పున్నయ్యశాస్త్రిగారు. వీరిది తిరుపతి. ఈలోగా ఈవూరువచ్చారు. వీరుసంస్కృతంలో చక్కని కవి. వీరి కవిత్వం చదివించాలనుకున్నాను. మీరు లేకపోతే సభకు పరిపూర్ణత లేదుగా..." సూర్యనారాయణగారు నవ్వారు.

పున్నయ్యశాస్త్రి నా వైపు తిరిగి చూడనైనా లేదు!

"శాస్త్రిగారూ! చదువుతారా!" అన్నారు సూర్యనారాయణగారు.

"ఏమిటి?" చెట్టుమీద కూర్చున్న జంటపక్షుల్ని కిటికీలోనుంచీ చూస్తూ ప్రశ్నించాడు పున్నయ్యశాస్త్రి.

"అవే! మీ పద్యాలు."

"నా పద్యాలా?"

"ఆఁ... నేను తిరుపతిలోవున్న రోజుల్లో వినిపించేవారు చూడండి - అవి–దుర్గాసహస్రం లోనివి."

"ఓ! అవా?" నవ్వాడు పున్నయ్యశాస్త్రి.

"ఆఁ అవే. చదవండి."

"మర్చిపోయాను."

సూర్యనారాయణగారు దీనంగా నావైపు చూచారు.

రెండు నిమిషాలు నిశ్శబ్దంగా కూర్చున్నాము. పున్నయ్యశాస్త్రి లేచి మెల్లిగా అడుగులేస్తూ గేటు దాటి వెళ్ళిపోయాడు.

"పాపం!" అన్నారు సూర్యనారాయణగారు.



"కాదండీ అదృష్టం. అతడు పడుతూ వెడుతూ ఏ గడియారమో వంకన పెట్టుకెళ్ళలేదు."

సూర్యనారాయణగారు ఆశ్చర్యంగా నా వైపు చూచారు. నేను జరిగిన సంగతంతా చెప్పాను. వారు అంతా విని ప్రశ్నించారు.

"వారిని మీరు దొంగనే అనుకుంటున్నారా?"

"మరేమనుకోమంటారు?"

"వారు దొంగ కారు. జీవితం ఠాకేసిన మనిషి. అతని జీవితం ఒక విషాదగీతం—ఆలపించమంటూరా?" సూర్యనారాయణగారు స్వయానా మంచి కవి. అందువల్ల వారి మాటలు కూడా కవితామయంగా వుంటాయి"

సరే నన్నట్లు తల వూపాను.

"శాస్త్రిగారితో నాలుగు సంవత్సరాల క్రితం పరిచయం కలిగింది. వారిది సంపన్న కుటుంబం రాకపోయినా సాహిత్యమంతా వారి సంపదే. అందువల్ల వారితో నా పరిచయం ప్రగాఢమైపోయింది. రోజూ సాయంకాలం ఇద్దరూ కలుసుకొనే వాళ్ళం.

"వారి ఇల్లు తమాషాగా వుండేది. ఏవేళలో విన్నా ఎవరో శిష్యుడు శ్లోకాలు వల్లెవేస్తుండేవాడు. శాస్త్రిగారు పెద్దగొంతుతో పాఠం చెబుతుండేవారు. అప్పుడప్పుడూ వారి కూతురు కనిపించేది..."

"పేరు గాయత్రి కదండీ?"

సూర్యనారాయణగారి కళ్ళలో ఆశ్చర్యం ఒక క్షణం తళుక్కుమంది.

"ఔను. కనిపించి చిరునవ్వుతో నమస్కారంచేసి వెళ్ళిపోయేది. శాస్త్రిగారి శిష్యుల్లో భక్తవత్సలం అని ఒక అబ్బాయి వుండేవాడు. అతడు కాలేజీలో సంస్కృతం చదువుతూ శాస్త్రిగారి వద్దకు ట్యూష

నుకు వచ్చేవాడు. అతడంటే శాస్త్రి గారికి పరమ వాత్సల్యం. ఇక గాయత్రి సంగతి సరేసరి! వారిద్దరూ ఒకర్నొకరు చూచుకున్నప్పుడు వారి కళ్ళలో తళుక్కుమనే ప్రేమను చూడాలి. ఆతళుకు శాస్త్రి గారికి కనిపించేది కాదనుకుంటాను.

"ఒక రోజు రాత్రి పదిగంటల సమయంలో గాయత్రి మాయింటికి పరుగెత్తుకొచ్చింది.

"ఏమిటమ్మాయ్ ఇంతరాత్రి పూట వచ్చావు?" అన్నాను.

"మీతో మాట్లాడాలి" అన్నది చుట్టూరాచూస్తూ.

"ఇక్కడ ఎవరూ లేరు. నిరభ్యంతరంగా మాట్లాడవచ్చు" అన్నాను.

గాయత్రి తలవంచుకొని కూర్చుంది. కానీ గొంతు విప్పలేదు.

"చెప్పు గాయత్రీ ఫరవాలేదు." అన్నాను.

"మా విషయం మానాన్నగారికి తెలిసి పోయింది" అంతకంటే ఎక్కువ చెప్పలేక పోయింది. వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఇక్కడ "మా" అన్న అక్షరం అర్థంకాక. ఒక్క క్షణం తికమక పడ్డాను" సూర్యనారాయణ గారు ఆగారు.

సూర్యనారాయణగారు చెబుతున్న పున్నయ్య శాస్త్రి జీవితం చాలా చిత్రంగా వుంది. అతనిది సందు బ్రతుకు. వెలుగు చీకట్లు తలంబ్రాలు పోసుకున్న సాయంసంధ్య... కానీ ఒక సందేహం కలిగింది.

"సూర్యనారాయణగారూ! గాయత్రి మీ ఇంటికి వచ్చిందన్నారే—ఆ అమ్మాయికి మీవద్ద అంత చనువెక్కడిదండీ?" ప్రశ్నించాను.

సిగరెట్టు ముట్టించుకోవటం పూర్తిచేసి సూర్యనారాయణగారు చెప్పసాగారు—

"అందుకొక కారణం వుంది. ఒకసారిఏదోసభకెళ్ళాలని నేనూమాశాస్త్రిగారూ నిశ్చయించుకున్నాం. కానీ నేను శాస్త్రిగారి ఇంటికెళ్ళేసరికి కాస్త ఆలస్యం జరిగింది. శాస్త్రిగారు సభకెళ్ళి పోయారు కాబోలు అనుకుంటూ వారి ఇంట్లోకి అడుగుపెట్టాను. ఒక్కసారిగా శరీరం జలదరించింది. భక్తవత్సలం శాస్త్రిగారి పడకకుర్చీలో పడుకొని వున్నాడు. గాయత్రి కుర్చీపట్టెమీద అతని మీదకు వంగికూర్చుని వుంది. గాయత్రికి హస్త సాముద్రికం చెబుతున్నాడు భక్తవత్సలం.

"అలాగైతే నాకు పెళ్ళి కాదంటారు?" అన్నది గాయత్రి.

"కాదు" అన్నాడు భక్తవత్సలం కృత్రిమ గాంభీర్యం నటిస్తూ.

"ఏలాగు దేవా! నా బ్రతుకు ఎడారియేనా? ఓ దేవా! దయామయా! భక్తవత్సలా నీవే దిక్కు."

గాయత్రి, భక్తవత్సలం భుజాల మీదకు వాలుతూ అన్నది.

"ఆ భక్తవత్సలుడే నీకు దిక్కు"

ఇద్దరూ నవ్వుకున్నారు. శబ్దార్థాల్లా



వున్న వాళ్ళను చూస్తే ముచ్చటకలిగింది... చిన్నగా దగ్గాను. భక్తవత్సలం నన్నుచూచి అదిరిపోయాడు. పైట చెరుగుతో బుగ్గలు తుడుచుకుంటున్న గాయత్రిఅలాగే స్తంభించిపోయింది. తర్వాత శాస్త్రిగారితో చెప్పవద్దని బ్రతిమాలారు. నవ్వుతూ సరేనన్నాను. వీలుంటే ఆ మూడుముళ్ళూ వేయించేస్తానన్నాను. ఇద్దరూ నా పాదాలంటి నమస్కారం చేశారు. గాయత్రికి నా వద్ద అంత చనువు వుండటానికి ఇదీ కారణం... ... ...తర్వాత గాయత్రి అంత రాత్రిపూట నావద్దకు ఎందుకొచ్చిందో మీకు అర్థమయిందనుకుంటాను." ప్రశ్నించారు సూర్యనారాయణగారు.

"... ... ... ..."

"తర్వాత నేనేం చేశాననుకుంటున్నారు?" సిగరెట్టు చివరిదమ్ములాగి పారేస్తూ మళ్ళీ ప్రశ్నించారు.

"వీలుచూచుకొని ఆ మూడుముళ్ళూ వేయించమని శాస్త్రిగారికి సలహా యిచ్చివుంటారు" అన్నాను.

"అలాగే చెప్పాను. ఆశ్చర్యం! వారుకూడా సరేనన్నారు. పదిరోజులు తిరక్కముందే లగ్నపత్రిక చేతికందింది. గాయత్రికి—భక్తవత్సలానికి కాళహస్తీశ్వరుని సన్నిధిలో వైశాఖ శుద్ధ పంచమి, మిథునలగ్న పుష్కరాంశమందు వివాహం... ... ఆ రోజు సాయంకాలం పున్నయ్య శాస్త్రిగారింటి కెళ్ళాను. శ్రీనాథుని సీసపద్యంలా ఎదురొచ్చింది గాయత్రి. అమాంతం నా కాళ్ళు తాకి నమస్కారం చేసింది.

"కల్యాణమస్తు" అన్నాను.

ఏదో చెప్పబోయి సిగ్గుతో వణికే పెదవులు యేం చెప్పాలనుకుంటున్నాయో నా కర్థమైంది.

"ఇందులో నేను చేసిందేముందమ్మా. అంతా మీ అదృష్టం" అన్నాను.

గాయత్రి సిగ్గుగా నవ్వింది.

"ఇంతకూ భార్యావత్సలుడేడీ?"

"పెళ్ళి ముగిసిందాకా ఈ ఛాయలకు రావద్దన్నారు నాన్నగారు" సిగ్గుతో కందిపోతున్న బుగ్గల్ని చెరుగుతో కప్పుకుంటూ అన్నది గాయత్రి... ...

పెళ్ళి రెండురోజు లుందనగా పిల్లను తీసుకెడుతూ మరొక్కసారి చెప్పిపోయారు శాస్త్రిగారు.

"పున్నయ్యశాస్త్రి జీవితంలో నిరంతరం ఓటమినే పొందుతున్నాడు. బంగారంలాంటి ఉద్యోగం నాశనం చేసుకున్నాడు. వలచివచ్చిన కవితను తిరస్కరించాడు. భార్యను చంపుకున్నాడు... ..."

"భార్యనా? ఎందుకూ?" సూర్యనారాయణగారికి అడ్డంతగులుతూ ప్రశ్నించాను.

"ఏదో మాటామాటా భార్యాభర్తలమధ్య పెరిగింది. అమాత్రానికే జందెం తెంపేసి వెళ్ళిపోయారు. ఆవిడ

వేచినన్నాళ్ళూ వేచి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. అప్పటికి గాయత్రి చిన్నపిల్ల—వయస్సు నాలుగేళ్ళట" అన్నారు సూర్యనారాయణగారు.

పున్నయ్యశాస్త్రిమీద ఇందాక కలిగిన సానుభూతి గాలి కెగిరిపోయింది. రోజూ తెలుగుపద్యం సౌందర్యం మొదలుకొని ఖగోళశాస్త్రం వరకూ అన్నివిషయాలనూ చక్కగా వివరించే సూర్యనారాయణగారు ఈ పున్నయ్య భాగోతంచదవటం నాకు విసుగేసింది. దానికితోడు రోళ్ళు బద్దలయ్యే వడగాడ్పులు!

"వెళ్ళుతానండీ!" అన్నాను.

"అలాకాదు. తీరా వినిపొండి. జీవితం త్రాచుపాములాంటిది. మనము దాని జోలికి పోయి చెరలాటం ఆడేమా—కాటేస్తుంది. పున్నయ్యశాస్త్రిగారు ఆ పనే చేశారు... పెళ్ళి ముందురోజు కాళహస్తి వెళ్ళాను. అక్కడ భక్తవత్సలంగానీ, అతని స్నేహితులుగానీ కనిపించలేదు... గాయత్రికూడా కనిపించలేదు! శాస్త్రిగారుమాత్రం అదోరకంగా కనిపించారు. ఆ వాలకంచూస్తే ఎవరికైనా అనుమానం, భయం కలుగుతాయి. నన్నెవరూ అక్కడ ఆదరంగా పలకరించనైనాలేదు. అందరూ కొత్తమనుషులు. ఒక మూలకెళ్ళి పడుకున్నాను... ...గాలిలేనికొంపలావుంది మనస్సు... ...అర్ధరాత్రి దాటి వుండవచ్చు. అరుపులూ, పెడబొబ్బలూ చెలరేగాయి. గాభరాగా నిద్రలేచి విచారించాను. గాయత్రిబావిలోదూకిందట... నాశరీరంగజగజ లాడిపోయింది. భయంతో కాలూచెయ్యి ఆడలేదు. నాకు నాళ్ళు తెలిసే సరికి నలుగురూ సాయంపట్టి గాయత్రిని బావిలోనుండి పైకి తీశారు. ఎవరో ప్రథమ చికిత్స చేస్తున్నారు. ఎవరో ఒక యువకుడు—పున్నయ్యశాస్త్రిని నానా బూతులు తిడుతున్నాడు.

"ఎవరయ్యా నువ్వు—వారి నెందుకలా మాట్లాడతావు?" అని అడిగాను.

"నువ్వెవరోయ్ మధ్యన! నేనెవరో కనిపించటం లేదూ? పెళ్ళికొడుకుని" అన్నాడు నన్ను పురుగును చూచినట్లుగా చూస్తూ.

"పెళ్ళికొడుకా?" ఆశ్చర్యపోయాను.

"ఆశ్చర్యంగా వుందా. ఇదిగో" జేబులోనుంచి ఒక పెళ్ళి పత్రిక నా ముఖాన విసిరాడు.

పున్నయ్య శాస్త్రిగారిని చూచాను. నీరసమైన చెక్కిళ్ళ మీదికి కన్నీరు కారుతోంది. లగ్న పత్రికను చదివాను—

... ... చి॥ సౌ॥ గాయత్రిని—
చి॥ నాగలింగ శాస్త్రికిచ్చి ... ...

భార్యతో పోట్లాడి పారిపోయిన పున్నయ్య శాస్త్రి తిరిగివచ్చింది ఇందుకోసమేనా అనిపించింది..." మనసు



భారమై సూర్యనారాయణగారు కూడా మాట్లాడలేక పోయారు. నేనూ యిల్లు చేరాను... ...

కొద్దిరోజులతర్వాత మళ్ళీ ఒకరోజు సూర్యనారాయణగారివద్ద కెళ్ళాను. షికారుకు వెళదామని ఇద్దరమూ చెరువుగట్టువైపుకు బయలుదేరాము. వారు శ్రీనాధుడు నెల్లూరివాడేనన్న విషయాన్నిగురించి గట్టిగా వాదిస్తూ నడుస్తున్నారు. ఒకచోట హఠాత్తుగా ఆగి అన్నారు.

"శాస్త్రిగారున్నారేమో చూద్దామా?"

నేను జవాబుచెప్పేలోగా వారు యిరుకుసందులోకి దారితీశారు... ఒక యింటిముందు ఆగి—

"శాస్త్రిగారూ!" అని పిలిచారు.

"లేరండీ—" అంటూనే తలుపు తీసిందొక అమ్మాయి. ఆవిడ మసిగుడ్డలో చుట్టిన మాణిక్యంలా వుంది.

"నా దొక పుస్తకం వుందమ్మా, తీసుకోవాలి" అన్నారు సూర్యనారాయణగారు.

"తీసుకోండి" అన్నది.

ఇద్దరమూ గదిలో కెళ్ళాము. గదినిండా ఎవరెవరివో పెళ్ళిఫొటోలు—మరికొన్ని పత్రికలలో అచ్చయిన వాటి కత్తిరింపులు.

సూర్యనారాయణగారు గూట్లో వున్న ఒక ఫొటో నందుకొని చూస్తూ మీ ఆవిడకు చాలా సిగ్గుగా వుందే— అన్నారు.

ఫొటోను తీసుకున్నాను.

సూర్యనారాయణగారు ఒక్కక్షణం ఆలోచించి అన్నాడు.

"ఏమండీ! మీ పెళ్ళిఫొటో తప్పకుండా మీకు కావాలా?" ఫొటోను తిరిగి ఇచ్చేశాను.

"అమ్మాయి గాయత్రీ! ఈ ఫోటోను గూట్లోనే వుంచు." అన్నారు సూర్యనారాయణగారు.

గాయత్రి ఫొటోనూ, నన్నూ ఒక్కసారిచూచి కళ్ళు తుడుచుకుంది. మేమిద్దరమూ వెనుదిరిగాము. తలుపుకు లోపలి వైపుకు పూర్తిగా లగ్న పత్రికలు అతికించ బడివున్నాయి. వాటిలో ప్రతిదాంట్లోనూ "నాగలింగశాస్త్రి" అన్న పేరు కొట్టి "భక్తవత్సలం" అని వ్రాయబడింది.

నేనూ సూర్యనారాయణగారు వీధిలోకొచ్చాము. తలుపు కావేపునుంచీ ఎక్కిళ్ళు వినిపిస్తున్నాయి.

సూర్యనారాయణగారి వైపు ఏమిటన్నట్లు చూచాను.

"గాయత్రి ఏడుస్తున్నది" అన్నారు

"ఎందుకూ?"

సూర్యనారాయగారు నిశితంగా నావైపు ఒక్క చూపు చూచారు. కానీ జవాబు చెప్పలేదు.

□□□